www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 17 సెప్టెంబర్ 2023
5
తిరుపతి



క్రెడాయ్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలు పంపిణీ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి చాప్టర్ క్రెడాయ్ మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం పర్యావరణ పరిరక్షణ మట్టివిగ్రహాలను పంపిణీ చేశారు. వినాయక చవితి పండగ సందర్భంగా ప్రజలు రసాయనాలతో కూడిన విగ్రహాలు వాడకుండా మట్టి విగ్రహాలు ఉపయోగించాలని కోరారు. ఆ సంఘం అధ్యక్షులు రాంప్రసాద్ సెక్రటరీ రాజేష్ బాబు వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ కోశాధికారి నరసింహారెడ్డి క్రెడాయి మహిళ వింగ్ కోఆర్డినేటర్ కీర్తన, సభ్యులు జ్యోతి, బిందు, రాజేశ్వరి, హరిణి పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ

సకల దేవతలకు ఆహ్వానం

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి అయినట్లు టిటిడి ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. రెండు లక్షల మంది భక్తులు వీక్షించేలా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. సామాన్య భక్తులకే ప్రాధాన్యం ఇచ్చేలా బ్రహ్మోత్సవాలు వేడుకగా జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బ్రహ్మోత్సవాలు జరిగే 9 రోజులు ప్రత్యేక దర్శనాలు రద్దు చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో 1.30లక్షల ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లతో పాటు సర్వదర్శనం భక్తులకు 24 వేల ఉచిత దర్శన టికెట్లు టిటిడి అందించనుందని తెలిపారు. అలాగే.. నడకదారిలో అంక్షలు కొనసాగుతాయని తెలిపారు. బ్రహ్మోత్సవాలు జరిగే రోజుల్లో బ్రేక్ దర్శనాలు, సిఫారసు లేఖలను అనుమతించబోమని ఇప్పటికే టీటీడీ స్పష్టం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఇప్పటికే మాడవీధుల్లో రంగవల్లులు టీటీడీ తీర్చిదిద్దామని.. గ్యాలరీల్లో ఉండే భక్తుల సౌకర్యార్థం తాగునీరు, మరుగుదొడ్ల అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

పుట్టమన్నులో నవధాన్యాలను..

తిరుమలలో సెప్టెంబర్ 18 నుంచి 26వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలకు సెప్టెంబర్ 17న రాత్రి 7 నుంచి 8 గంటల వరకు వైఖానస ఆగమ శాస్త్రాన్ని అనుసరించి అంకురార్పణ జరగనుంది. ఇందులో భాగంగా శ్రీవారి తరపున సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనులు వారు మాడవీధుల్లో ఊరేగింపుగా వెళ్లి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. అనంతరం ఆలయంలో భూమాతకు ప్రత్యేకపూజలు నిర్వహించి పుట్టమన్నులో నవధాన్యాలను నాటి వాటికి మొలకలొచ్చే వరకు నీరు పోస్తారు. ఆ తరువాత రంగనాయకుల మండపంలో ఆస్థానం నిర్వహిస్తారు.

రేపు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు

18వ తేదీన సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. సాయంత్రం 6.15 నుండి 6.30 గంటల మధ్య మీనలగ్నంలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహిస్తారు. ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి.

వాహన సేవల వివరాలివీ..

18న రాత్రి 9గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారు 7 తలల స్వర్ణ శేషవాహనంపై (పెద్ద శేషవాహనం) మాడ వీధుల్లో భక్తులను అనుగ్రహిస్తారు. 19న ఉదయం 8 గంటలకు 5 తలల చిన్నశేష వాహనంపై, రాత్రి 7గంటలకు శ్రీమలయప్పస్వామి వారు వీణాపాణియై హంస వాహనంపై సరస్వతీమూర్తి అవతారంలో దర్శనమివ్వనున్నారు. 20న ఉదయం 8 గంటలకు సింహ వాహనంపై, రాత్రి 7 గంటలకు ముత్యపు పందిరి వాహనంపై ఊరేగుతారు. 21న ఉదయం 8 గంటలకు శ్రీమలయప్ప స్వామివారు ఉభయ దేవేరులతో కలిసి కల్పవృక్ష వాహనంపై, రాత్రి 7గంటలకు సర్వభూపాల వాహనంపై భక్తులకు అభయమిస్తారు. 22న ఉదయం 8 గంటలకు శ్రీవారు మోహినీ రూపంలో శృంగారరసాధి దేవతగా దర్శనమిస్తారు. రాత్రి 7 గంటలకు గరుడ వాహనంలో ఊరేగుతారు. 23న ఉదయం 8 గంటలకు శేషాచలాధీశుడు రాముని అవతారంలో తన భక్తుడైన హనుమంతునిపై ఊరేగుతారు. సాయంత్రం 4 గంటలకు శ్రీనివాసుడు స్వర్ణరథంపై, రాత్రి 7గంటలకు గజవాహనంపై తిరువీధుల్లో విహరిస్తారు. 24న ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనంపై, రాత్రి 7గంటలకు చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. 25న ఉదయం 6.55 గంటలకు శ్రీమలయప్పస్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. అదే రోజు రాత్రి 7గంటలకు స్వామివారు అశ్వవాహనంపై విహరిస్తారు. 26న ఉదయం 6 గంటలకు చక్రస్నానాన్ని, రాత్రి 7గంటలకు బంగారు తిరుచ్చి ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అనంతరం ధ్వజావరోహణాన్ని శాస్త్రోక్తంగా చేపడతారు. దీంతో తొమ్మిది రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

భక్తులకు గమనిక

- స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులకు మాత్రమే దర్శనానికి అనుమతిస్తారు.
- వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు తదితర ప్రివిలైజ్ దర్శనాలు రద్దు
- బ్రహ్మోత్సవాల రోజుల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహనసేవలు
- సెప్టెంబర్ 22న గరుడ సేవ కారణంగా.. ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాల రాకపోకలు రద్దు

చల్లారని సనాతన రచ్చ

ప్రజాదృష్టి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తమిళనాడు ముఖ్యమంత్రి కుమారుడు, ఆ రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే లేపాయి. సామాజిక మాధ్యమాన్ని ఊపేస్తున్నాయి. హిందుత్వశక్తులు, ముఖమైన బీజేపీ దాని నాయకులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. అనేక లౌకిక పార్టీలు, లౌకిక మేధావులు రకరకాలుగా స్పందిస్తున్నారు. కొందరు ఆయన వాదనలను బలపరుస్తుంటే, మరికొందరు స్టాలిన్ వ్యాఖ్యలు ఇప్పుడిప్పుడే బీజేపీకి వ్యతిరేకంగా అఖిల భారత స్థాయిలో కూడుతున్న ఇండియా కూటమిపైకి దాడి చేసే అవకాశం బీజేపీకి ఇచ్చినట్లు అయిందని బాధ వ్యక్తం చేస్తున్నారు. నిజానికి స్టాలిన్ అన్న మాటలు కొత్తవేమీ కాదు. గతంలో అనేకమంది తత్వవేత్తలు, సామాజిక ఉద్యమ కారులు పదేపదే చెప్పిన విషయాల్ని ఆయనా చెప్పారు. తమిళనాడు అభ్యుదయ రచయితలు, కళాకారుల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ దోమలు ద్వారా వ్యాపించే డెంగీ, మలేరియా, కరోనా వైరస్ వంటి వాటిని తుడిచిపెట్టినట్లుగానే సనాతన ధర్మాన్ని కూడా తుడిచి పెట్టాలని, కేవలం వ్యతిరేకిస్తే సరిపోదని వ్యాఖ్యానించారు. దీనిపై బీజేపీ సోషల్ మీడియా దాడి ప్రారంభించింది. రాజస్థాన్ ఎన్నికల ప్రచారంలో అమిత్ షా, జెపీ నడ్డా స్థాయి నాయకులు స్టాలిన్ మీద, ఆయన పార్టీ అయిన డీఎంకే మీద, దాని భాగస్వామ్యపక్షమైన కాంగ్రెస్ మీద, వీరందరూ కలిసి నిర్మిస్తున్న ఇండియా కూటమి మీద తీవ్రమైన ఆక్రోశం వెలిబుచ్చారు. ఇండియా కూటమిని ఎలా ఎదుర్కోవాలి అని మల్లగుల్లాలు పడుతున్న బీజేపీ, దాని మాతసంస్థ ఆర్ఎస్ఎస్ హిందుత్వ శక్తులు ఈఅంశాన్ని వినియోగించుకోవాలని ఆరాటపడుతున్నాయి.

ఇది అనాదిగా ఉన్న చర్చ...

హిందూమతానికి తొలి రూపమైన బ్రాహ్మణ, వైదిక మతాలపైన గౌతమ బుద్ధుడు మూడువేల సంవత్సరాల క్రితమే ఈపోరాటం ప్రారంభించాడు. బ్రాహ్మణ మత సిద్ధాంతాన్ని చార్వాకులు, లోకాయతులు, సాంఖ్యులు ఇటువంటి అనేకమంది తాత్వికులు తీవ్రంగా వ్యతిరేకించారు. వీరందరినీ భౌతికంగా అణిచివేస్తూ వారి అమూల్యమైన సాహిత్యాన్ని ధ్వంసం చేస్తున్న క్రమంలో హిందూ మతం అనేది రూపం తీసుకుంది. హిందూమతానికి కులవ్యవస్థకు విడదీయరాని సంబంధం ఉంది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బౌద్ధంపై... బ్రాహ్మణాధిక్యతను ప్రేరేపించే హిందూ మతం సాగించిన ప్రతీఘాత విప్లవం నుండే పురాతన సమాజాన్ని అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నాడు. ఈవాదనతో ప్రముఖ మార్క్సిస్టు చరిత్రకారులు రొమిల్లాథాపర్, డిఎన్‌ఝా, జైస్వాల్ వంటి వారు ఏకీభవిస్తున్నారు. క్రీస్తు శకం 14వ శతాబ్దం నుండి ఈబ్రాహ్మణాధిక్య సమాజం సష్టిస్తున్న మతాధిక్యవాదంపై మరోసారి కెరటంలా వ్యతిరేకత పెల్లుబుకింది. యోగివేమన, పోతులూరి వీరబ్రహ్మం వంటి వారు మన రాష్ట్రంలో, బసవన్న వంటి వారు కర్నాటకలో, రవిదాసు, గురునానక్ వంటి వారు పంజాబ్ ప్రాంతంలో, ఆ తరువాత కేరళలో నారాయణ గురు వంటి వారు కులవ్యవస్థ మీద, దానికి అండగా నిలిచే హిందూ మత భావజాలం పైన పోరాడారు. గురునానక్ కొత్తగా సిక్కుమతాన్ని ప్రారంభించాడు. వీరందరి పోరాటంలో మనకి కనపడేది సనాతన ధర్మాన్ని తెగనాడటమే. ఆ తరువాత 19,20 శతాబ్దాలలో బ్రిటిష్ పరిపాలనా కాలంలో మరలా మరో కెరటంలా సాంఘిక ఉద్యమాలు వెల్లువెత్తాయి. మహారాష్ట్రలో జ్యోతిరావ్ పూలే, తమిళనాడులో పెరియార్ రామస్వామి, ఆంధ్రరాష్ట్రంలో త్రిపురనేని రామస్వామి చౌదరి వంటి వారు అనేకమంది కుల వ్యవస్థ పైన, అందుకు ప్రతిరూపంగా ఉన్న బ్రాహ్మణాధిక్యతపైన బలమైన ఉద్యమాలు నడిపారు.

కేరళలో అయ్యంకాళి, దేశవ్యాప్తంగా చూసినప్పుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ లాంటి వాళ్లు కుల వ్యవస్థను నిర్మూలించడానికి చేసిన కషి మన గమనంలో ఉండాలి. క్రీస్తుపూర్వమైనా, మధ్య యుగాలలోనైనా, ఆధునిక కాలంలోనైనా భారత తాత్విక చింతనలో ప్రధాన ఘర్షణ ఈ బ్రాహ్మణాధిక్య మనువాదానికి, నిమ్నజాతుల (శూద్రులు, అతిశూద్రులు) అభ్యున్నతి కోసం నిలబడ్డ తత్వవేత్తలు, సామాజిక ఉద్యమకారుల మధ్యే. కులదురహంకారులు నాడు–నేడు కూడా తమ క్రూరత్వం కనపడకుండా ఉండటానికి ఈ సనాతన ధర్మమనే పదాన్ని చాక చక్యంగా వాడుకుంటూనే ఉన్నారు. అందువలన ఈ చర్చ కొత్తది కాదు, తేడా ఏమంటే గతంతో పోల్చినప్పుడు ఈ మనువాద శక్తులు అనేక రెట్లు బలం పుంజుకున్నాయి. కేంద్రంలో అధికారంలోకి వచ్చాయి. అనేక ప్రభుత్వ సంస్థలని, పరిపాలన వ్యవస్థలని ఆక్రమించుకుంటున్నాయి. ఈ స్థితి నుంచి వారు చేసే దాడి బలంగా, విస్తారంగా ఉంటుంది. అందువలన ఈ శక్తులకు వ్యతిరేకంగా సామాజిక, లౌకిక, ప్రజాతంత్ర శక్తులన్నీ ఒక తాటి మీదకు రావాలి.

ఈ నేపథ్యంలో హిందుత్వ శక్తులపై పోరాటం బలంగా సాగాలి. వాటితో పోలిస్తే నేడు దళిత ఉద్యమం, గిరిజనుల ఐక్యత, మహిళా ఉద్యమాలు, వీరందరికీ ఏదో ఒక మేరకు అండదండలిచ్చే లౌకికశక్తులు విడివిడిగా అయినప్పటికీ బలపడ్డాయి. అలాగే వీరందరినీ కూడదీసే కార్మిక, కర్షక, ఉద్యోగుల ఉద్యమాలు, పోరాటాలు పెరుగుతున్నాయి. వీటికి తోడు బీజేపీని ఓడించాలి అన్న శక్తులు ఒక దగ్గరకు వస్తున్నాయి. ఇవన్నీ అణగారిన ప్రజలకు విశ్వాసాన్ని కలిగిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితులను ఉపయోగించుకోవాలి. ఏ మాట అన్నా అది బీజేపీకి, హిందుత్వ శక్తులకి ఉపయోగపడుతుందే మోనన్న భయం అర్థరహితం. హిందూత్వ శక్తుల దాడి తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు ప్రతిదాడి కూడా అన్ని పార్శ్వాలలో తీవ్రంగా ఉండాలి. అందుకు కావలసినంత సాహిత్యం, సమాచారం, సాంకేతిక పరిజ్ఞానం మనకున్నాయి. బీజేపీ ముందుకు తెస్తున్న అనేక వాదనలను, చరిత్ర వక్రీకరణలను అనేకమంది మేధావులు పూర్వపక్షం చేస్తున్నారు. అన్నింటినీ మించి కులదురభిమానాన్ని భరించలేని జనం వున్నారు. అందువలన హిందూత్వ శక్తుల విషప్రచారాన్ని స్టాలిన్ వంటి వారే కాదు, ప్రతి భారతీయుడు నిలబడేటట్లు చేయాల్సిన బాధ్యత వామపక్ష ప్రజాతంత్రశక్తుల మీద వుంటుంది.

వైఎస్సార్ కాపు నేస్తం ద్వారా

రూ .12.76 కోట్లు లబ్ధి

నగర మేయర్ డాక్టర్ శిరీష

ప్రజాశక్తి- తిరుపతి టౌన్ : నవరత్నాలే కాకుండా మహిళలను ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశ్యంతో అనేక సంక్షేమ పథకాలను అమలులోకి మన వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకురావడం జరిగిందని తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. శనివారం ఉదయం తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో ఏర్పాటు చేసిన బహిరంగసభ వేదిక నుంచి నాలుగో విడత వైఎస్సార్ కాపునేస్తం పథకం లబ్ధి మొత్తాని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి నేరుగా మహిళల బ్యాంక్ ఖాతాలో జమచేసే కార్యక్రమం ప్రారంభించగా స్థానిక జిల్లా కలెక్టరేట్ నుంచి తిరుపతి నగర మేయర్ శిరీష, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోదండ రామిరెడ్డి అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన నవరత్నాలే కాకుండా అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చారని తెలిపారు. వసతి దీవెన, విద్యాదీవెన, విద్యాకానుక వంటి పథకాలే కాకుండా మేనిఫెస్టోలో లేని మరెన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి లబ్ధి చేకూరుస్తున్నారని అన్నారు. మహిళలకు సంపూర్ణ ఆరోగ్య దిశగా.. వైయస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని కూడా తీసుకొని రావడం జరిగిందని తెలిపారు. వైఎస్సార్ కాపు నేస్తం ద్వారా జిల్లాలో 2023–24 సంవత్సరంకు 8512 మంది బలిజ, తెలగ, ఒంటరి సామాజిక వర్గంకు చెందిన మహిళలకు రూ.12.76 కోట్లు నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నేడు జమ చేశారని అన్నారు. తిరుపతి జిల్లాలో 2020–21 నుండి నాలుగు విడతలలో వైయస్సార్ కాపు నేస్తం పథకం ద్వారా 30,176 మందికి రూ.45.26కోట్లు లబ్ధి మొత్తాన్ని నేరుగా బటన్ నొక్కి మహిళల ఖాతాలోకి జమచేయడం జరిగిందని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కును అధికారులతో కలిసి అందచేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి భాస్కర్‌రెడ్డి, బిసి కార్పోరేషన్ ఏఈఓ బాబు రెడ్డి, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎస్వీసీఈలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): తిరుపతి– కరకంబాడీ మార్గంలోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో శనివారం సిస్టమాటిక్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ అనలిటికల్ టూల్స్ ఇన్ ఇండస్ట్రీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎగ్జిక్యూటివ్ ట్రైనర్, క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా(క్యూసిఎఫ్ఐ) స్పీకర్‌గా ధన్‌రాజ్ గుప్తా వ్యవహరించారు. పరిశ్రమలు, సంస్థలలో విశ్లేషణాత్మక సాధనాల క్రమబద్ధమైన అమలు, నిర్ణయాత్మక ప్రకియలను మెరుగుపరచడానికి, కార్యకలాపాలను ఆప్టిమైజ్ చేయడానికి, ఆవిష్కరణలను నడపడానికి గణాంక విశ్లేషణ, మెషిన్ లర్నింగ్, డేటా విజువలైజేషన్, డేటా ఆధారిత పరిష్కారాలకు ఉపయోగపడుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సుధాకర్ రెడ్డి, హెచ్ఓడి చంద్రశేఖరరెడ్డి, సదస్సు కోఆర్డినేటర్ రాజేష్ పాల్గొన్నారు.

అణగారిన ప్రజల గొంతుక బొజ్జాతారకం

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): అణగారిన ప్రజల గొంతుకగా ప్రజల ఆర్థిక, రాజకీయ, సామాజిక అసమానతలను రూపుమాపిన గోప్పవ్యక్తి బొజ్జాతరకం అని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షులు పి.అంజయ్య అన్నారు. శనివారం తిరుపతి నగర పరిధిలోని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా కార్యాలయంలో ఏడవ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో దళితులు, ఆదివాసీయులు, పేదప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఉద్యమాలు, న్యాయస్థానాలకు తీసుకెళ్ళి పరిష్కరించి పేదల పక్షపాతిగా గుర్తించబడ్డారన్నారు. ఎపి యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోటయ్య, ప్రముఖ కవి, రచయిత గొడుగుచింత గోవిందయ్య మాట్లాడుతూ చుండూరు, కారంచేడు, లక్ష్మింపేట సంఘటనల్లో భాదితులకు అండగా ఉండి సుప్రీంకోర్టు వరకు వెళ్లి భాదితులకు న్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో ఆర్‌పిఐ తిరుపతి జిల్లా అధ్యక్షులు సుబ్రమణ్యం, అమరనాథ్, తీగల బాబు, నాగేంద్ర, హరిబాబు, ధనంజయులు, దేవా, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

సమీక్ష సమావేశంలో కమిషనర్ హరిత

ప్రజాశక్తి- తిరుపతి టౌన్ : 18న తిరుపతిలో శ్రీనివాససేతు ప్రారంభోత్సవానికి విచ్చేయుచున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పర్యటనలో చేయాల్సిన ఏర్పాట్లపై తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత శనివారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో మొదట మ్యాంగోమార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన శ్రీనివాససేతు ప్రారంభోత్సవ శిలాపలకాన్ని ఆవిష్కరించడం జరుగుతుందని, అందుకు తగ్గ ఏర్పాట్లను సిద్ధం చేయాలన్నారు. అక్కడనే ఏర్పాటు చేసిన వేదిక వద్ద విఐపిలకు, మీడియా వారికి కావల్సిన స్నాక్స్, తాగునీరు ఏర్పాటు చేయించాలని అన్నారు. అక్కడి నుండి ముఖ్యమంత్రి నేరుగా తాతయ్యగుంట గంగమ్మ దర్శనానికి వెలతారని, అందుకోసం ముఖ్యమంత్రి పయనించే మార్గాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు తగినచర్యలు చేపట్టాలన్నారు. గంగమ్మగుడి దర్శనం అనంతరం తిరుమలకి బయలుదేరుతారు కనుక, అలిపిరి మార్గం వరకు కాన్వాయ్ ప్రయణించే రోడ్లను చక్కగా వుండేలా చూడాలన్నారు. మరుసటి రోజు ముఖ్యమంత్రి తిరిగి వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా అధికారులు పాటించేలా చూడాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి అవాంతరాలు కలగకుండా పటిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్లాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ఎస్ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, ఆర్వోలు కెఎల్.వర్మ, సేతుమాధవ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్‌రెడ్డి, స్మార్ట్‌సిటీ జి.ఎం చంద్రమౌళి, సెక్రటరీ రాధిక, డీఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్రరెడ్డి, సంజీవ్ కుమార్, మహేష్, నరేంద్ర, డిప్యూటీసిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్రరెడ్డి, సూపరింటెండెంట్ పి.రవి, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచెయ్య, సుమతీ, ఆర్ఐలు పాల్గొన్నారు.

సీఎం పర్యటన వివరాలు

ఈనెల 18వతేదీ 3.15 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడి నుండి 3.50 గంటలకు శ్రీనివాససేతు ప్రారంభోత్సవం, ఎస్వి ఆర్ట్స్ కళాశాల నూతన హాస్టల్ భవనాల ప్రారంభ శిలాఫలకం ఆవిష్కరణ, టీటీడీ ఉద్యోగులకు ఇంటిస్థలాలు కేటాయింపు పత్రాల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 04.30 గంటలకు తాతయ్య గుంట గంగమ్మ తల్లి గుడి చేరుకుని 5.40 గంటలకు తిరుమల చేరుకుని వకుళమాత అతిథి గృహం, రచన అతిథిగృహాలను ప్రారంభించి, శ్రీపద్మావతి అతిథి గృహం చేరుకుంటారు. రాత్రి 7.45 గంటలకు బేడీ ఆంజనేయస్వామిని దర్శించుకుని శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, స్వామివారిని దర్శించుకుని, టీటీడీ క్యాలండర్ 2024ను ఆవిష్కరించి, పెద్దశేష వాహనసేవలో పాల్గొని శ్రీపద్మావతి అతిథి గృహంలో రాత్రి బస చేయనున్నారని తెలిపారు. ఈ నెల 19న ఉదయం మరోమారు తిరుమల శ్రీవారిని దర్శించుకుని ఉదయం 7:35 గంటలకి తిరుమల నుండి బయలుదేరి రేణిగుంట విమానాశ్రయం చేరుకుని ఉదయం 9 గంటలకు ఓర్వకల్ విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లనున్నారు.

బ్రహ్మోత్సవాలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు: డిజిపి

ప్రజాశక్తి- తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయనున్నట్లు డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం తిరుమల నాలుగు మాడవీధుల్లో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. డిజిపి మాట్లాడుతూ శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా 18 నుండి 26వ తేదీ వరకు శ్రీవారి వాహనసేవలు తిరుమల నాలుగు మాడవీధుల్లో టిటిడి వారు నిర్వహిస్తున్నారు. గరుడసేవ రోజున సుమారు రూ.4 నుండి 5లక్షల భక్తులు వచ్చే అవకాశం ఉందని, మిగతా రోజుల్లో సుమారు రోజుకి లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున 3782 మందితో పోలీస్ సిబ్బందితో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు గట్టి భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు మెదటివిడత 2622మంది సిబ్బందితో బందోబస్తు, గరుడ సేవ రోజున అదనంగా మరో 1160 మంది సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహిస్తారని తెలిపారు. గరుడసేవ రోజున అదనపు బలగాలతో మరింత పటిష్టమైన భద్రత చర్యలు. గరుడసేవ రోజు తిరుమలకు ద్విచక్ర వాహనాలకు అనుమతి లేదని, 21వ తేదీ మధ్యాహ్నం 12గంటల నుండి అనుమతించబడవని, ఈ నెల18న శ్రీవారికి ముఖ్యమంత్రి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. తిరుమలలో అనుమానిత వ్యక్తులపై నిరంతరం సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, తిరుమలలో 32 పార్కింగ్ స్థలాలను గుర్తించి సుమారు 15వేల వాహనాలను పార్కింగ్ చేయుటకు వీలుగా చర్యలు తీసుకున్నామన్నారు. టూరిస్ట్ బస్సులు, తిరుమలకు అనుమతి నిరాకరించిన (సీటింగ్ కెపాసిటీ ఎక్కువ ఉన్న టెంపో (ట్రావెల్) వాహనాలకు జూపార్క్ రోడ్లులో గల దేవలోక్ పార్కింగ్ ప్రాంతాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. గరుడ సేవ రోజు ద్విచక్ర వాహనాల పార్కింగ్ కోసం అలిపిరి లింకు బస్సు స్టాండ్, పాత చెక్ పాయింట్, ఇస్కాన్ గ్రౌండ్, మెడికల్ కాలేజీ గ్రౌండ్, నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్ ప్రాంతాలు ఏర్పాటు చేశామని, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పోలీస్ శాఖ పని చేస్తుందన్నారు.

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు రెండు ఘాట్ రోడ్లు, తిరుమల పరిసర ప్రాంతాలన్నింటిని స్పెషల్ పార్టీ పోలీసులు జల్లెడ పడతారన్నారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లు ఘాట్ రోడ్లు తిరుమల పరిసర ప్రాంతాలలో ముమ్మరంగా తనిఖీలు చేస్తాయన్నారు. ఈ తనిఖీలు నిరంతరం బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు జరుగుతాయని అన్నారు. ఆక్టోపస్ సిబ్బంది కూడా తిరుమలలో ప్రత్యేక నిఘాతో పని చేస్తారని తెలిపారు. తిరుమలలోని నాలుగు మాడవీధుల్లో శ్రీవారి బ్రహ్మోత్సవాలను వీక్షించేందుకు గ్యాలరీలలో చేరుకున్న భక్తులు తొక్కిసలాట జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నాము. ఎంట్రీ పాయింట్, ఎగ్జిట్ పాయింట్లు వద్ద తగిన సిబ్బందిని నియమించి పటిష్ట చర్యలు, గరుడ సేవ రోజున టిటిడి నిర్ధేశించిన సమయానికి భక్తులను గ్యాలరీలలోకి అనుమతిస్తామన్నారు. తిరుమల మొత్తం సీసీ కెమెరాలతో, పోలీసుల ఆధీనంలో ఉంటుందన్నారు. తమ సిబ్బంది కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా సీసీ కెమెరాలను పర్యవేక్షించి ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేస్తారన్నారు. ఎక్కడైనా రద్దీ పెరిగినా ఆ ప్రాంతాలను అప్పటికప్పుడే గుర్తించి తగు చర్యలు చేపడతామని, ముఖ్యంగా భక్తులకు సౌకర్యార్థం 10 పోలీసు సబ్‌కంట్రోల్ రూం లు ఏర్పాటు చేసి, పోలీసు సిబ్బందితో పాటు మహిళా శిశుసంక్షేమ శాఖ సిబ్బందిని కూడా ఏర్పాటు చేసి, చిన్న పిల్లలు, మతిస్థిమితం లేని వారు, వయోవద్ధులు తప్పిపోకుండా ఏర్పాటు చేసి ఉన్నామని సహాయం కొరకు పోలీస్‌వారిని సంప్రదించాలని కోరారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో నేరాలను నియంత్రించేందుకు 220 మంది క్రైమ్ పార్టీ అధికారులు సిబ్బందిని నియమించామన్నారు. ఇప్పటికే తిరుమలలోని పలు ప్రదేశాలలో చైన్ స్నాచింగ్, జిప్ ఓపెనింగ్, బ్యాగ్ లిఫ్టింగ్ లాంటి నేరప్రదేశాలను గుర్తించారు.

కళాయజ్ఞ ఆర్ట్ కాంటెస్ట్‌కి అనూహ్య స్పందన

చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): చిన్నారుల్లో దాగి ఉన్న సజనాత్మకశక్తిని వెలికితీసి వారికి చిత్రకళపై ఆసక్తి పెంపొందించాలనే ముఖ్యఉద్దేశ్యంతో శ్రీకళాక్షేత్ర, తిరుపతి బాలోత్సవం, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం శ్రీరామచంద్ర పుష్కరిణిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు నిర్వహించిన కళాయజ్ఞ ఆర్ట్ కాంటెస్ట్‌కి అనూహ్య స్పందన లభించింది. తిరుపతి పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 100 విద్యాసంస్థల నుంచి 1600మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 1 నుంచి 10 తరగతి వరకు నిర్వహించిన ఈ కాంటెస్ట్‌లో 1, 2, 3 తరగతుల వారిని సబ్ జూనియర్స్‌గా విభజించి వారికి నచ్చిన అంశంపై, 4, 5, 6 తరగతుల వారిని జూనియర్స్‌గా విభజించి వారికి నచ్చిన ప్రదేశం అనే అంశంపై, 7, 8, 9, 10 తరగతుల వారిని సీనియర్స్‌గా విభజించి వారికి ప్లాస్టిక్ రహిత తిరుపతి అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చిన్నారులు తమ చిత్రకళా నైపుణ్యంతో చక్కటి సందేశాత్మక చిత్రాలను చిత్రించి ఆహుతులను అలరించారని నిర్వాహకులు తెలిపారు. ఈ కాంటెస్ట్‌లో పాల్గొన్న ప్రతిఒక్కరికి ప్రశంసాపత్రాలు, గెలుపొందిన విజేతలకు ప్రశంసాపత్రాలతో పాటుగా జ్ఞాపికలు ముఖ్యఅతిథులు చేతులు మీదుగా ఆదివారం మధ్యాహ్నం అంజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈకార్యక్రమాన్ని మల్లారపు నాగార్జున, టెంకాయల దామోదరం, నడ్డి నారాయణ, ఎస్.రెడ్డప్ప, గురునాథం, ముకేష్, జి.మురళీ, సుజాత, మునిలక్ష్మి, తహస్సున్నిసా, ఓవి.రమణ, సాగర్ గిన్నె, ఆనంద్, లావణ్య, దివ్య, హేమప్రియ, రత్నశేఖర్, విజయవాడ ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ బృందసభ్యులు సునీల్‌కుమార్ అనుమకొండ, గిరిధర్ అరసవల్లి, స్ఫూర్తి శ్రీనివాస్, ఎస్పి.మల్లిక్‌లు పర్యవేక్షించగా భారీ సంఖ్యలో కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ వ్యాపారులకు గొడుగులు పంపిణీ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి లయన్స్ క్లబ్ అధ్యక్షులు బి.మునికష్ణ నాయుడు ఆధ్వర్యంలో తిరుపతి నగరంలో గాంధీరోడ్డు, రైల్వేస్టేషన్, ఎస్‌వి.నగర్ తదితర ప్రాంతాలలో వీధి వ్యాపారమే జీవనాధారంగా సాగిస్తున్న నిరుపేదలకు ఎండకు, వానకు రక్షణగా గొడుగులు క్లబ్ తరఫున ఉచితంగా వితరణ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధుల్లో వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేదలకు ఎండకు, వానకు రక్షణగా మా వంతు సహకారంగా తిరుపతి నగరం ప్రధాన వీధుల్లో వీధి వ్యాపారమే జీవనాధారంగా సాగిస్తున్న నిరుపేదలకు ఉచితంగా క్లబ్ తరఫున గొడుగులు వితరణ చేయడం జరిగినది. సేవా కార్యక్రమాల్లో తిరుపతి లయన్స్ క్లబ్ ఎప్పుడు ముందు వరుసలో ఉంటుందన్నారు. అనంతరం వీధి వ్యాపారులకు గొడుగులు వితరణ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు బి.మునికష్ణ నాయుడు, కార్యదర్శి ముబారక్ బాషా, ట్రెజరర్ వినోద్ వెంకటాచలం, లయన్స్ క్లబ్ జిల్లా అదనపు కార్యదర్శి డాక్టర్ కే.రాజేంద్రప్రసాద్, సీనియర్ సభ్యులు ఎమ్మార్ రాజా, మోహన్ సుందరం పాల్గొన్నారు.

కాస్ట్ అకౌంటెంట్స్ ఛాప్టర్ ఛైర్మన్‌గా పార్థసారథి

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): శనివారం జరిగిన కార్యవర్గ సమావేశంలో కాస్ట్ అకౌంటెంట్స్ ఛాప్టర్ తిరుపతి ఛైర్మన్‌గా డాక్టర్ పార్థసారథి ఆల్లను ఎన్నుకున్నారు. వైస్‌ఛైర్మన్‌గా వి.గురప్ప నాయుడు, సెక్రటరీగా కె.పూర్ణచంద్రారావు, జాయింట్ సెక్రటరీగా ముస్తాక్ షేక్, ట్రెజరర్‌గా సి.చైతన్య కుమార్ రెడ్డి, జాయింట్ ట్రెజరర్‌గా రాధారాణిలను ఎనుకున్నట్లు కార్యవర్గ సభ్యులు తెలిపారు. గత 25ఏళ్లుగా తిరుపతిలోని ప్రముఖ విద్యాసంస్థల్లో పార్థసారథి సేవలు అందించారు.

జాతీయ కుస్తీ పోటీలలో విద్యార్థినుల సత్తా

ప్రజాశక్తి - క్యాంపస్ : హర్యానాలోని రోహతక్ లో గ్రాప్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సెప్టెంబర్ 8వ తేదీ నుండి 11వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి గ్రాప్లింగ్ కుస్తీ అండర్ 11-15పోటీలలో ఆంధ్రప్రదేశ్ తరపున శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినిలు పాల్గొన్నారు. డి.రిజ్వాన జూ.సి ఇ సి-గోల్డ్ మెడల్, కె.పావని- జూ.సి ఇ సి- సిల్వర్ మెడల్,పి. చైత్ర- జూ.హెచ్ఈ సి-బ్రాంజ్ మెడల్, వీరందరిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.భువనేశ్వరి దేవి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ క్రీడలు చదువుకు పరోక్షంగా ఎంతో ఉపయోగపడతాయని, ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మ గౌరవాన్ని పెంచుతాయని, వ్యూహాలు, లక్ష్యాలను, మరింత శక్తి ,శ్రద్ధ మానసిక సామర్థ్యాలను పెంచుతాయని అన్నారు. మిగతా విద్యార్థినిలంతా క్రీడల్లో రాణించాలని, టిటిడి యాజమాన్యం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొని, వీరికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ సాయి సుమతిని అభినందించడమైనది. విద్యార్థినిల అభినందన కార్యక్రమంలో అధ్యాపకులు డా.ఎ. జయమ్మ పాల్గొన్నారు.

మేతలో భూ బకాసురులు

- పశువుల మేత భూములు స్వాహా
- కబ్జాలకు నిలయంగా ఓజిలి మండలం

ప్రజాశక్తి - ఓజిలి : ప్రభుత్వ భూముల ఆక్రమణకు అంతేలేకుండా పోతోంది. రెవెన్యూ యంత్రాంగంలో కొంతమంది అక్రమ సంపాదనకు అలవాటు పడి దైవంగా పూజించే తమ వృత్తికి మచ్చ తీసుకువస్తున్నారు. గతంలో విధులు నిర్వహించిన కంప్యూటర్ ఆపరేటర్, ఓ అధికారి చేతివాటం చూపించి భూములను గందరగోళంగా సృష్టించారు. ఓజిలి మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణకు కొదవలేదు. గత అధికారుల హయాంలో కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములు ప్రస్తుతం ఒకటి ఒకటిగా వెలుగులోకి వస్తున్నాయి. పెత్తందారులతో చేతులు కలిపి ఎంతో విలువైన ప్రభుత్వ భూములను ధారా దత్తం చేస్తున్నారనే ఆరోపణ లేకపోలేదు. వేలాది ఎకరాల మేత పోరంబోకు భూములలో పచ్చని గడ్డి మేస్తూ,గుంటల్లో ఈదుతూ భూదేవి ఒడిలో సేద తీరుతూ పశువులు పరుగులు తీసే ప్రదేశాలపై భూ బకాసురుల డేగ కళ్లు పడి కబ్జాల పరంగా మారింది. దీంతో పశువులకు మేత కరువుతో పశువులను అమ్ముకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వందేళ్ల తర్వాత భూ సమగ్ర రీ సర్వే పనులకు శ్రీకారం చుట్టింది. ఇదే అదునుగా భావించి భూ బకాసురులు ప్రభుత్వ మేత పోరంబోకు భూములు సాగులో ఉన్నట్లు చూపించి. ప్రభుత్వ భూములను తమ పరం చేసుకునేందుకు రెవెన్యూ సిబ్బందితో ముడుపుల ఒప్పందలు కుదుర్చుకున్నట్లు ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. అంతేకాకుండా రెవెన్యూ మాయాజాలంతో ఎంతో విలువైన ప్రభుత్వ భూములను పెత్తందారులకు , వారి అనుచరులకు కట్ట పెట్టేందుకు అసైన్మెంట్ కమిటీకి ప్రతిపాదనలు పంపినట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. మేత పోరంబోకు భూములను అసైన్మెంట్ భూమిగా మార్పు చేయాలంటే పంచాయతీ తీర్మానం, మండల స్థాయి అధికారుల పర్వేషణ నివేదికతో కలెక్టర్ కు ప్రతిపాదనలు పంపించాల్సి ఉంది. అది కూడా భూములు లేని నిరుపేదల కోసం భూ పంపిణీ చేసేందుకు కలెక్టర్ ఆదేశాలతో మేత పోరంబోకు భూమిని అసైన్మెంట్ గా మార్పు చేయాల్సి ఉంది. బీడుగా ఉన్న భూములను తప్పుడు నివేదికలతో భూ బకాసురులు సాగులో లేకపోయినా ఉన్నట్లు అసైన్మెంట్ కమిటీకి పేర్లను ప్రతిపా దించడం పట్ల సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఓజిలి మండలంలో ఎంతో విలువైన ప్రభుత్వ భూములను భూ బకాసురుల చెరలో నుండి కాపాడాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

ఓజోన్ పొర ఆవశ్యకతపై ర్యాలీ

ప్రజాశక్తి- బిఎన్‌కండ్రిగ: ఓజోన్ దినోత్సవం సందర్భంగా బిఎన్ కండ్రిగ జడ్పి హైస్కూలులో శనివా రం ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపా ధ్యాయులు కె రమణయ్య ఓజోన్ పొర ఆవశ్యకత, సంరక్షణ గురించి వివరించారు. కాలుష్యం పెరిగిపోవడం వల్ల ఓజోన్ పొర పలుచబడి అతి నీలలోహిత కిరణాలు భూమి మీద ప్రసరించడం వల్ల క్యాన్సర్ లాంటి రోగాలు బారిన పడతారని తెలిపారు. ఈ సమస్యను ప్రపంచ సమస్యగా భావించి అందరూ వాతావరణ కాలుష్యాన్ని తగ్గించాలని, ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని, చెట్లను ఎక్కువగా పెంచాలన్నారు. ఈ సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల పంపిణీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రజలందరి ఆనందం కోసం తాను ప్రతి ఏటా ఉచితంగా వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు ప్రముఖ సంఘ సేవకుడు, వినాయక చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు సురేంద్రకుమార్ రెడ్డి అన్నారు. స్థానిక రోటరీ క్లబ్ ఆవరణలో శనివారం ఆయన మూడు జిల్లాలకు చెందిన సుమారు వెయ్యి గ్రామాలకు వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. తాను ప్రతి ఏటా రూ. కోటికి పైగా ఖర్చు పెట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నా మని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసు లు, స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె పవిత్రా రెడ్డి, జనసేన నాయకులు కొట్టే సాయి, రాఘవయ్య పాల్గొన్నారు.

తిరుచానూరు: చంద్రగిరి నియోజకవర్గంలో వినాయక చవితిని పురస్కరించుకొని ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో పల్లె పల్లెకు పర్యావరణ హితమైన కాగితంతో తయారైన 1,060 పెద్ద వినాయక విగ్రహాలను శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. టీటీడీ ఈఓ ధర్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి వినాయక విగ్రహాల తరలింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. చంద్రగిరి నియోజకవర్గంలో ప్రతి పంచాయితీలోని వీధి వీధికి పెద్ద విగ్రహాలు పంపిణీ 34 ప్రాంతాల నుంచి 108 గ్రామాలకు అందజేయనున్నట్లు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఏడాది తుమ్మలగుంటలో నెమలి ఈకలతో సరికొత్త అవతారంలో, ఆకర్షణీయంగా వినాయకుని ప్రతిమను రూపొం దిస్తున్నట్లు తెలిపారు. తిరుచానూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ విద్యా గణపతి నాయుడు, తిరుపతి వినాయక నిమజ్జన కమిటీ సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, సామంచి శ్రీనివాస్, నవీన్ కుమార్ రెడ్డి, మంగాటి గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

ప్రజాశక్తి -ఏర్పేడు: మండలంలోని కొత్త వీరాపురం పంచాయతీలో ఉపాధి హామీ పార్కులేషన్ పాండ్ పనులను డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సివి శ్రీనివాస్ ప్రసాద్ శనివారం తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. పంచాయతీ లో జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికీ ఉపాధి పనులు కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలను పెంపొందించాలని, భూములు కలిగి ఉన్న ప్రతి షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, చిన్న సన్నకారు రైతుల పండ్ల తోటల పెంపకం , పూల తోటల పెంపకం, ఉపాధి హామీ ద్వారా చేపడితే వారి పొలాల్లోని చెట్లను సంరక్షించుకుంటే వేతనాలు, మెటీరియల్ పేమెంట్లు మూడు సంవత్సరాల పాటు ఉపాధి హామీ ద్వారా ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. హౌస్ స్కీం ద్వారా పూర్తయిన ఇళ్ల వద్ద సోక్ పీట్లు నిర్మించడం వల్ల పారిశుద్ధ్యంతో పాటు వర్షం నీటిని, కిచెన్ కి ఉపయోగించే వృథా నీటిని సోక్ పిట్ ద్వారా భూగర్భ జలాలు మృతి చెందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ సాలి మనోహర్, అదనపు కార్యక్రమాధికారి అవిలాల దేవరి పాల్గొన్నారు.

టిడిపి నాయకుల నిరాహార దీక్ష

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ మండలం టీడీపీ నాయకులు ,కార్యకర్తలు భారీ సంఖ్యలో మండల పార్టీ అధ్యక్షులు సుధాకర్ నాయుడు అధ్యక్షతన శనివారం నిరాహార దీక్ష నిర్వహించారు. టీడీపీ దీక్ష కు మద్దతుగా జనసేన నాయకులు పా ల్గొన్నా రు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే హేమలత, సత్యవేడు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి హెలెన్ హేమలత, మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు కుమారుడు ఎస్‌సివి దిలీప్ పాల్గొన్నారు. చిన్నపాలవేడు వాస్తవ్యులు తమిళనాడు డాక్టర్ పోచమ నేనీ వెంకటేశ్వర్లు దీక్ష కు మద్దతు తెలిపారు. ముఖ్య అతిథులతో పాటు జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కన్నయ్య నాయుడు, మాజీ మేదర కార్పొరేషన్ చైర్మన్ సుందరయ్య , మహిళ అధ్యక్షురాలు ఉషారాణి, శ్రీనివాసులు పలువురు జగన్ అరాచక పాలనపై ధ్వజమెత్తారు.

వెంకటగిరి రూరల్: టిడిపి నాయకులు డాక్టర్ మస్తాన్ యాదవ్ ఆధ్వర్యంలో మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు టిడిపి కార్యకర్తలు ఆజాద్, అరుణ్, పరుశురాం, రమణయ్యలు అర గుండులతో శనివారం నిరసన వ్యక్తం చేశారు. గత రెండు రోజులుగా వెంకటగిరి పట్టణంలోని డాక్టర్ మస్తాన్ యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా అరగుండు తో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుల తోట రామచంద్రయ్య, సిసింద్రీ , టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుపై మాజీ మంత్రి చంద్రమోహన్ రెడ్డి సంజీవి పట్టణంలోని రిలే నిరాహార దీక్షలో శనివారం పాల్గొని రాజకీయ కుట్ర అరెస్టుగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకు డు డాక్టర్ మస్తాన్ యాదవ్,రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు కె వి కె ప్రసాద్, మండల టిడిపి అధ్యక్షుడు పప్పు చంద్రమోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, భాస్కర్ రెడ్డి, రామచంద్రయ్య, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

గూడూరు : మాజీ ముఖ్యమంత్రి అరెస్టును నిరసిస్తూ గూడూరు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పాశం సునిల్ కుమార్ ఆధ్వర్యంలో రిలే దీక్షల్లో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు. దీక్షలో రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్ కుమార్, రాష్ట్ర నాయకులు భాస్కర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- నాయుడుపేట: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి గ్రామాభివృద్ధి సాధించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. శనివారం నాయుడుపేట ఎంపీడీవో కార్యా లయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మండల సమావేశాలకు ఎంపీటీసీలు, సర్పంచులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. అధికారులు ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరాలు తెలిపి వాటిని అమలు పరిచేందుకు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. అర్హతే ప్రామా ణికంగా ప్రతి పేదవాడికి సంక్షేమ పథకా లు అందించడంలో అధికారుల కీలకపాత్ర పోషిం చాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చురుకుగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించి నప్పుడే గ్రామాభి వృద్ధి సాధ్యమవు తుందన్నారు. ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి మాట్లాడుతూ అధికారు లు అర్హత ఉన్న ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందించి ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చేందుకు కృషి చేయాలని సూచిం చారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం సద్విని యోగం అయ్యేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జగనన్న భూ రీ సర్వే రైతులకు ఎంతగానో ఉపయోగ పడు తుందన్నారు. మండల వ్యవసాయ అధికారి గణేష్ మాట్లాడుతూ ఈ వ్యవసాయ సీజన్లో రైతులకు సబ్సిడీతో పచ్చ రొట్ట విత్తనాలను అంది స్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట జడ్‌పిటిసి కట్టా జ్యోతి రెడ్డి, తహశీల్దారు ఎం రాజేంద్ర, ఎంపీడీవో శివప్రసాద్, పలువురు అధికారులు, కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు లయన్స్ క్లబ్ ఆఫ్ వైజేపీ ఆధ్వర్యంలో ప్రతి నెలా క్రమం తప్పకుండా వృద్ధులకు నిత్యావసర సరుకులు అందిస్తున్నామని ఈ నెల నుండి ప్రతి నెలా మొదటి ఆదివారం ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్షులు ఎస్ఎల్ఎన్ స్వామి పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్ ఆడిటోరియంలో లయన్స్ క్లబ్ ఆఫ్ వైజేపీ ఆధ్వర్యంలో వృద్ధులకు నిత్యావసర సరుకులు అందించారు. ఇంజనీర్స్ డే సందర్భంగా క్లబ్ సీనియర్ మెంబర్ చంద్రశేఖర్ రెడ్డిని సన్మానించారు. క్లబ్ మాజీ చైర్మన్ బాబురావు తల్లి పుట్టిన రోజు సందర్భంగా చీరలు, స్వీట్లు అందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు ఎస్ఎల్ ఎన్ స్వామి మాట్లాడుతూ డాక్టర్ సిఆర్ రెడ్డి కుటుంబ సభ్యులు, కొంతమంది దాతలు సహ కారంతో మూల నిధిని ఏర్పాటు చేసి దాని ద్వారా వచ్చే డబ్బుతో ప్రతి నెల క్రమం తప్పకుండా వృద్ధులకు నిత్యావసర సరుకులు అందిస్తు న్నా మని, రాబోయే రోజుల్లో సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు రవీంద్ర రెడ్డి , పాస్ట్ రీజియన్ చైర్మన్ ఆర్‌విరావు, క్లబ్ సెక్రటరీ గోపినాథ్‌రెడ్డి , పాస్ట్ జోనల్ చైర్మన్ మురళి నాయుడు , రాధాకృష్ణ రెడ్డి , ప్రసాద్ , రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

మల్లె సాగులో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: మల్లెపూల తోటలో ప్రతి రైతు కొన్ని జాగ్రత్తలు పాటిస్తూ వాటికి తగిన పోషక విలువలను అందిస్తే మంచి దిగుబడులను సాధించవచ్చని స్పిక్ అండ్ గ్రీన్ స్టార్ ఫెర్టిలైజర్స్ ఎగ్జిక్యూటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ తిరుమలరావు పేర్కొన్నారు. శనివారం నారాయణ వనం మండలం కొండలచెరువులో మల్లె తోటలను సాగు చేస్తున్న రైతులకు క్షేత్ర స్థాయి ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేసి కొన్ని సలహాలు సూచనలు అందించారు. ఇందులో భాగంగా ఆ కంపెనీ తయారు చేస్తున్న మందులను ఎరువు లను ప్రదర్శన ఏర్పాటు చేసి రైతులకు మల్లె తోటలో పాటించాల్సిన మెలకువలతో పాటు మందుల పనితీరును వివరించారు. గతంలో ఈ కంపెనీ అందించిన మందులు వాడిన రైతు లను అడిగి తెలుసుకున్నారు. రైతుల స్పందిస్తూ వారు అందించిన ఎరువులు మందులు తమ మల్లె సాగుకు ఎంతో మేలు చేస్తున్నాయని ప్రస్తుతం వారు దిగుబడిని సాధిస్తూ లాభదాయకంగా ఉన్నామని రైతులు పేర్కొన్నారు. ఈ అవగాహన సదస్సులో సుమారు 50 మందికి పైగా మల్లెపూల రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్పిక్ అండ్ గ్రీన్ స్టార్ ఫెర్టిలైజర్స్ ఎగ్జిక్యూటివ్ మార్కెటింగ్ అధికారి ఉమామహేశ్వర్ రెడ్డి, స్పిక్ జూనియర్ మార్కెటింగ్ అధికారి ముబారక్, రైతులు పాల్గొన్నారు.

సమగ్ర ఆరోగ్య పరిరక్షణలో హోమియో పరిశోధనలు కీలకపాత్ర

శాస్త్రవేత్త డాక్టర్ శివప్రసాద్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సమగ్ర ఆరోగ్య పరిరక్షణ లో హోమియో పరిశోధన ల పాత్ర ఎంతో కీలకమైందని, ఆయుష్ హోమియో పరిశోధనా కేంద్రం శాస్త్ర వేత్త డాక్టర్ శివప్రసాద్ అన్నారు. స్థానిక కెకెసి హోమియో కళాశాలలో జరిగిన మొదటి సంవత్సరం హోమియో విద్యార్థుల ఫ్రెషర్స్ డే కళాశాల చైర్మన్ కె కుప్పయ్య శెట్టి, వైస్ చైర్మన్ నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథి మాట్లాడుతూ హోమియో వైద్య రంగంలో జరుగుతున్న పరిశోధ నలు ప్రజారోగ్య పరిరక్షణ లో కీలక పాత్ర వహిస్తున్నాయని ఇది ఎంతో ఆహ్వానించదగిన పరిణామమని అన్నారు. హోమియో విద్యార్థులు కూడా పరిశోధనల పై ఆసక్తి చూపాలన్నారు. క్యాన్సర్, మధుమేహంతో పాటు ఇటీవలి కరోనా మహమ్మరిని అరికట్టడం లో హోమియో మందులు ఎంతో ఉపయుక్తంగా నిలిచాయని అన్నా రు.తద్వారా హోమి యో వైద్య సేవలు మరింత ప్రాచుర్యం పొందయని అన్నారు. హోమియో విద్యార్థులు అన్ని కీలక వైద్య పాఠ్యం శాలపై పట్టు సాధించినపుడే ఉత్తమ ,విజయవంతమైన వైద్యులు గా పేరుపొందవచ్చన్నారు. యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ ర్యాంకు లు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో,మంజుల రవి శేఖర్,వైష్ణవి, హోమియో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శరవణన్, సలహాదారు హరనాథ్ శెట్టి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, హోమియో విద్యార్థులు పాల్గొన్నారు .

దళితులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి గ్రామీణ పోలీసులు దళితులపై బనాయించిన అక్రమ హత్యాయత్నం కేసు ఎత్తివేయాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండు చేశారు. ఈ మేరకు వారు రాష్ట్ర ఎస్‌సి కమిషను విక్టర్ ప్రసాద్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. శ్రీకాళహస్తి మండలం గుంటకిందపల్లె వద్ద భూ సమస్య పరిష్కారం చేయాలని శాంతియుత మార్గంలో న్యాయ పోరాటం చేస్తున్న దళితులపై అక్రమంగా హత్యాయత్నం కేసు బనాయించడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నించారు. దళితులకు అండగా నిలిచిన విశ్రాంత సైనికుడు, జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులి శ్రీకాంత్ ను కూడా ఈ కేసులో ఇరికించారన్నారు. ఈయనతో పాటు ఆనంద్, పరంధామ, మరో ఇద్దరు మహిళలపై పోలీసులు హత్యాయత్నం కేసు పెట్టారన్నారు. రాజకీయ నేతల ఒత్తిళ్లతోనే పోలీసులు ఇలా చేశారని వారు ఆరోపించారు. భూ వివాదం కేసులో వీరు ఎవరిపై దాడి చేయ 1లేదన్నారు. తప్పుడు కుల ధృవీక రణ పత్రం జారీ చేసిన అధికారుల భాగోతం బయట పడుతుందనే ఉద్దేశ్యం తోనే పోలీసులు ఇలా చేశారన్నారు. ఇందుకు స్పందించిన రాష్ట్ర ఎస్సీ కమిషను ఛైర్మన్ విక్టర్ ప్రసాద్ వెంటనే తిరుపతి ఎస్పీ, శ్రీకాళహస్తి డీయస్పీతో మాట్లాడారు. కేసు పూర్వాపరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ అక్రమ కేసులో దళితులను ఎవరినీ అరెస్టు చేయద్దని ఆదేశించారు. విక్టర్ ప్రసాద్ ను కలసిన వారిలో పులి శ్రీకాంత్ సతీమణి పుష్ప, పి. పరమశివన్, ప్రసాద్ రావు, జి. ధనశేఖర్, కాలయ్య, పవన్ (బిట్టు), త్యాగరాజు, గాలి సుధాకర్, సైమన్ శ్రీనివాసులు, డి. సుబ్రమణ్యం, నాగభూషణం, పెంచలయ్య, కిరణ్, శోభ, మోహన్ కుమార్ ఉన్నారు.

ఇంటింటికీ జగనన్న ఆరోగ్య సురక్ష

పజాశక్తి- వెంకటగిరి రూరల్ : తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం లోని పెట్లూరు గ్రామంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నూత నం గా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ మా పరిధిలో ఉన్న సచివాలయం గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష యాప్ లో నమోదైన పేర్లను గుర్తించి వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహి స్తున్న ట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ముఖ్య ఉద్దేశం తో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టారని, ఈ అవకాశం ప్రతి ఒక్కరూ విని యోగించుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు.

విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా కోర్సులు ఎంచుకోవాలి

ప్రజాశక్తి - రేణిగుంట: పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు వారి అభిరుచులకు తగ్గట్లుగానే కోర్సులను ఎంచుకోవాలని ప్రగతి కో-ఆర్డినేటర్ తులసి రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో రేణిగుంట గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో 9, 10 వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి తులసీరాం రెడ్డి మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థుల జీవితంలో చాలా కీలకమన్నారు. కెరీర్‌ని ఎలా మలచుకోవాలో టెన్త్ తర్వాత తీసుకునే నిర్ణయమే వారి లక్ష్యాలను చేరుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. టెన్త్ పాస్ కాగానే ఇక కెరీర్‌లో ఎటు వైపు అడుగులు వేయాలో అన్న డైలమా చాలామంది విద్యార్థుల్లో ఉంటుందన్నారు. టెన్త్ తర్వాత ఎంచుకునే కోర్సులే కెరీర్‌ను నిర్ణయిస్తాయి. అందుకే పదో తరగతి పాస్ కాగానే కోర్సుల్ని కెరీర్‌ను ఎంచుకునే విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి అని అన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సరైన కోర్సుల్ని ఎంచుకుంటేనే కెరీర్ కూడా హ్యాపీగా సాగిపోతుందన్నారు. లేదంటే కెరీర్ గందరగోళంగా మారడం ఖాయమని అందుకే మీ అభిరుచితో పాటు మంచి భవిష్యత్తు ఉండే కెరీర్ ఎంచుకోవడం మంచిది. కెరీర్ ఎంచుకునే విషయంలో కాస్త అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండటం మంచిది. మీ ఇష్టాలు, అభిరుచులకు తగ్గట్టు గానే కోర్సుల్ని ఎంచుకోవాలి. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల ఒత్తిడితో కోర్సుల్ని ఎంచు కుంటే తర్వాత కెరీర్‌లో ఒడిదుడుకులు ఎదుర్కోవలసి ఉంటుందని తెలిపారు. ప్రొఫెషనల్ కోర్సులు, డిప్లొమా, వొకేషనల్ సర్టిఫికేట్ కోర్సులు వంటి కోర్సుల గురించి వివరించారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ హరిబాబు మాట్లాడుతూ ప్రగతి ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడు విధంగా వారికి వివిధ కోర్సులు వాటిని ఎలా ఎంచుకోవాలని వివరించారని, ఈసందర్భంగా ప్రగతి సంస్థ వారికి ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు వారి సలహాలు సూచనలు పాటించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రగతి మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి ఉపాధ్యాయులు విద్యార్థులు3 పాల్గొన్నారు.

ముందస్తు చవితి వేడుకలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక శేషశాయి పాఠశాలలో వాతావరణం కలుషిత నివారణను.పాటిస్తూ ముందస్తు మట్టి వినాయక చవితి వేడుకలు ఆ పాఠశాల డైరెక్టర్స్ డా కె. రమేష్ , ఎస్ వి సుబ్బయ్య, డి జయప్రకాష్ , కె ఎస్ మనోజ్, ఎన్. శారదా నరసింహ రావు, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చెంచయ్య, డైరెక్టర్ ఎన్. ఇంద్రజిత్ వినాయ కునికి పూజలు నిర్వ హించారు. ఈ రోజుల్లో వాతావరణం కలుషితం లేని విగ్రహాలు పూజించారు. ఈకార్యక్రమంను 'పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఏవో, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్యాంపస్: తిరుపతి జీవకోనలోని విశ్వం హై స్కూల్లో ఘనంగా ముందస్తు వినాయక చవితి పండుగ సంబరాలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్ విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు వినాయక చవితి పండుగ ప్రాముఖ్యత, మన సంస్కృతి, సంప్రదాయాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా ర్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరిం చాయి. విద్యార్థినీ, విద్యార్థులు పలు వేషధారణల్లో ఆకట్టు కున్నారు. మంచి వేషధారణలతో అలరించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ వేడుకల్లో అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి, కరస్పాండెంట్ తులసి విశ్వనాథ్, ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని బ్రైట్ కేర్ రిహాబిలిటేషన్ కేంద్రంలో శనివారం వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బ్రైట్ కేర్ బ్రైట్ కేర్ సెంటర్ స్పీచ్ థెరపిస్ట్ చార్లెస్ చవితి విశిష్టతను పిల్లలకు తెలిపారు. ది స్కూల్ లో ముందస్తు వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వర స్వామి విగ్రహాన్ని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. పీవీఆర్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రతాప్ రావ్ వి.పవార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.విశాల పాల్గొన్నారు.

ఫార్మసీ లో మేనకకు డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ ఫార్మసీ విభాగం పరిశోధక విద్యార్థిని టి.మేనకకు వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆ విభాగం ఆచార్యులు బి రమ్య కుబేర్ మార్గ దర్శకత్వంలో ' ఇంప్యూరిటీ ప్రొఫైలింగ్, న్యూ మెథడ్ డెవలప్‌మెంట్ అండ్ వాలిడేషన్ ఆఫ్ డిప్రిడమోల్, డ్రోనడారోనే ఇన్ బల్క్ అండ్ ఫార్మసియు టికల్ ఫార్ములేషన్ ' అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు ఆమెకు డాక్టరేట్ లభించిందని వర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య జీవనజ్యోతి తెలిపారు.

టిడిపి వారికి కుల దూషణలు సరికాదు: లక్ష్మయ్య

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చంద్రబాబును స్కిల్ స్కామ్‌లో సిఐడి అధికారులు దోషిగా గుర్తించి కోర్టు ద్వారా రిమాండ్‌కు పంపితే ఆయన కోసం నిరసనలు తెలిపే క్రమంలో బెంగుళూరులో ఒకరు రజకులను కుల పరంగా దూషించడం సరికాదని యావత్ రజకుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేసిన సదరు మహిళపై కేసులు నమోదు చేయాలని ఎపి రజకజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు అక్కినపల్లి లక్ష్మయ్య డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుల దూషణలు చేసిన మహిళపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో రజక కులస్థులందరూ శిబిరాలు ఏర్పాటు చేసి నిరసనలు చేస్తామన్నారు. రణధీరపురం పంచాయతీ ఉపసర్పంచ్ మల్లెమొగ్గల ఉమాపతి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 24 లక్షల మంది రజకుల మనోభావాలు దెబ్బతినేలా అన్న మహిళను వెంటనే అరెస్ట్ చేయాలని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రజక నాయకులు పాల్గొన్నారు.

భూమన్ ప్రోత్సాహంతోనే యాదవులకు సముచిత స్థానం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి రాజకీయాల్లో ఎన్నడూ లేని విధంగా యాదవ సామాజికవర్గానికి చెందిన వారికి రాజకీయ ప్రాధాన్యమిచ్చి విలువను పెంచింది ఒక్క భూమన కరుణాకరరెడ్డి మాత్రమేనని అఖిల భారత యాదవ మహా సంఘం జాతీయ అధ్యక్షులు బుసగాని లక్ష్మయ్య అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి పరిధిలో ఆలయాల కమిటీలు, నగరపాలక సంస్థ కార్పొరేటర్ల ఎంపికల్లో భూమన కరుణాకరరెడ్డి అన్నింటా యాదవులకు సముచిత ప్రాధాన్యం ఇచ్చారన్నారు. అంతే కాకుండా తిరుపతిలో నిర్మించిన 18 మాస్టర్ ప్లాన్ల రోడ్లలో మూడింటికి పేరుగాంచిన యాదవుల పేర్లను పెట్టారన్నారు. రిజర్వేషన్ల కోసం ఏర్పాటైన బిపి మండల్ విగ్రహాన్ని దక్షిణాదిలో తిరుపతిలో ఏర్పాటుకు భూమన కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసు యాదవ్, తులసి యాదవ్, రమేష్ యాదవ్, సురేష్ యాదవ్, భరణి యాదవ్, వెంకటముని, అనిల్ పాల్గొన్నారు.

నమ్మకంతో పనిచేస్తా: వెందోటీ

ప్రజాశక్తి - బాలాయపల్లి : తమ కుటుంబం పై నమ్మకంతో వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి బాలాయపల్లి మండల పార్టీ అధ్యక్ష పదవి ఇచ్చినందుకు నమ్మకంగా ఉంటూ పని చేస్తామని వెందోటి కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. మండల ప్రజలకు నమ్మకంగా ఉంటూ అందరిలో ఒకడిలా పనిచేస్తానని తెలిపారు. మనందరం 2024 ఎన్నికల్లో మండలంలో అతిథిగా ఓట్లు వచ్చేందుకు శక్తివంచన లేకుండా పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. తమ కుటుంబం రెండు తరాలుగా నేదురుమల్లి కుటుంబంతో ఉంటున్నామన్నారు.

పుదిపట్లలో చెవిరెడ్డి పెళ్లి కానుక

ప్రజాశక్తి - క్యాంపస్ : ఇద్దరు ఒక్కటై సరికొత్త దాంపత్య జీవితాన్ని ఆరంభించనున్న నూతన వధూవరులను ఆశీర్వదిస్తూ ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సొంత నిధులతో పెళ్లి కానుకను అందించి ఆశీర్వదిస్తున్నారు. శనివారం తిరుపతి రూరల్ మండలం పరిధిలోని పుదిపట్ల కి చెందిన పెళ్లి జంటకు కానుకలను అందజేశారు. కానుకలను వారి తల్లిదండ్రులు అందుకున్నారు. ఈ కానుకలో నూతన వధూ వరులకు పట్టు వస్త్రాలు, 2 గ్రాముల బంగారు తాళిబొట్టు, రెండు గ్రాములు వెండి కాలిమెట్లు, శ్రీవారి కల్యాణోత్సవ లడ్డు, వడ, అమ్మవారి పసుపు, కుంకుమ, పసుపుదారం వధూ వరులకు పెళ్లి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పంపిన గ్రీటింగ్ కార్డు ఉంటాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అందిస్తున్న కానుకల పట్ల వధూవరులు, తల్లిదండ్రులు ప్రశంసలు కురిపించారు.. నూతన వధూవరులు సువేత, ప్రసాద్ లకు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ నాయకులు సుబ్రమణ్యం నాయుడు, పందిటి గోపి, మహేంద్ర,, మురళి, హరీష్ పాల్గొన్నారు.

టిడిపి నేతల విడుదల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: హత్యాయత్నం కేసులో ఈ నెల 10వ తేదీన అరెస్టయి రిమాండుకు వెళ్లిన ఎనిమిది మంది టీడీపీ నేతలు శనివారం సాయంత్రం బెయిల్ పై విడుదలయ్యారు. వీరికి తిరుపతి జిల్లా కోర్టు కండిషన్ బెయిల్ మంజూరు చేసింది. హత్యాయత్నం కేసు మొత్తం 16మందిపై నమోదు చేయగా, అందులో ఎనిమిది మందిని అరెస్టు చేసి రిమాండుకు పంపిన సంగతి తెలిసిందే. మిగిలిన వారు ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నం చేస్తున్నారు. కాగా బెయిల్ పై విడుదలైన టీడీపీ నేతలకు శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు.

మానవాళి మనుగడకు

ఓజోన్ పొర సంరక్షణ అవసరం

ప్రజాశక్తి - క్యాంపస్ : అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని శనివారం స్థానిక శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో భౌగోళిక శాస్త్ర అధ్యాపకురాలు డి.అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ వై. గంగాధరరావు ఈ సంవత్సరం మాంట్రియల్ ప్రోటోకాల్ ఓజోన్ పొరను స్థిరీకరించడం, వాతావరణ మార్పులను తగ్గించడం " అనే థీమ్ నేపథ్యంతో విద్యార్థులకు ఈ అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ డా. సి.వాసుదేవులు నాయుడు, డిప్యూటీ వార్డెన్ డా. సిఎల్. చెన్నా రెడ్డి, అధ్యాపకులు, చంద్రికాభాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

రేణిగుంట : 'పుడమికి రక్షణ కవచం ఓజోన్ అని ఓజోన్ నీ కాపాడుకుందాం భూమిని రక్షించుకుందాం..' అని ఆర్ మల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. శనివారం రేణిగుంట మండలంలోని ఆర్ మల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ అధ్యక్షతన ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈసందర్భంగా ప్రధానోపా ధ్యా యులు వెంకటరమణ, వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. పైడి అంకయ్య ఓజోన్ పొర ఆవశ్యకతను వివరిం చారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యాస రచన, వకృత్వం, చిత్రలేఖనం, క్విజ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు వే ఫౌండేషన్ వారు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిట్టిబాబు, బ్రహ్మానందరెడ్డి, రవి, పరంధామ రెడ్డి, దేవరాజులు, చూడామణి తదితర ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

కుల దూషణలను అందరూ ఖండించాలి: రవి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రజకుల మనోభవాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేసిన బెంగుళూరులో టీడీపికి చెందిన మహిళను వెంటనే అరెస్ట్ చేయాలని రాజీవ గాంధీ రజక సహకార సంఘం అధ్యక్షులు బొమ్మగుంట రవి డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రజకులను దూషించడం బాధాక రమన్నారు. సదరు మహిళపై చట్టపరమైన చర్యలు తీసుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘాల ఐక్య వేధిక తిరుపతి జిల్లా అధ్యక్షులు మల్లెమొగ్గల ఉమాపతి, సుబ్రమణ్యం, కన్నయ్య పాల్గొన్నారు.

తిరుపతి రూరల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్స్

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని మంగళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(మంగళం ట్రెండ్స్) లో శనివారం తిరుపతి రూరల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్స్‌ను నిర్వహించామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.కేశవుల నాయుడు తెలిపారు. ఈ సెలక్షన్స్‌లో 285 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో కబడ్డీ, కోకో, బాల్ బ్యాడ్మింటన్ మొదలైన క్రీడల్లో మంగళం ట్రెండ్స్ స్కూల్, చెర్లోపల్లి, తిరుచానూరు, దుర్గ సముద్రం, పెరుమాళ్లపల్లి, మల్లంగుంట స్కూల్ క్రీడాకారులు ప్రతిభ చూపి నియోజకవర్గం పోటీలకు ఎంపికయ్యారన్నారు. మంగళం సర్పంచ్ వరలక్ష్మి రాంబాబు, స్కూల్ కమిటీ చైర్మన్ సుశీల, పీడీలు రామకృష్ణ, సాంబశివరావు, సుదర్శన్, మునిశేఖర్, సురేంద్ర, నాగమల్లేశ్వరి, విజయ్, పిఇటీలు చిరంజీవి, మనోహర్, గజేంద్ర, చంద్రశేఖర్, శ్రీకాంత్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మొదటి రెండవ స్థానాలు సాధించిన వారు చంద్రగిరిలో నిర్వహించే అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.